క్లుప్తంగా

నేడు కంటి వైద్య శిబిరం

మక్కపేట(వత్సవాయి): పిన్నమనేని సిద్ధార్థ వైద్యశాల, కొమరగిరి ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ట్రస్టు ప్రతినిధి కొమరగిరి రవీంద్ర భరద్వాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో శ్రీ సాయిసెంచరీ హైస్కూల్ ఆవరణలో ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శిబిరం నిర్వహిస్తారన్నారు. శిబిరంలో పరీక్షలు జరిపించుకునేవారు విధిగా వారి ఆధార్ కార్డు జిరాక్స్‌ను వెంట తీసుకొనిరావాలని సూచించారు.

కంచికచర్లలో జాతీయ పంచాయతీ దినోత్సవం

కంచికచర్ల: కంచికచర్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం నిర్వహించారు. ముందుగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, గాంధీజీ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సర్పంచి వేల్పుల సునీత మాట్లాడుతూ గాంధీజీ కన్న కలలను రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనా వికేంద్రీకరణ చేసి నిజం చేశారన్నారు. పంచాయతీ కార్యదర్శి కనగాల రవికుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు చేసి పల్లె ప్రాంతాలన్నీ అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచి వేమా సురేష్‌బాబు, ఎంపీటీసీ సభ్యులు, నన్నపనేని నరసింహారావు, మాడుగుల మధుబాబు, వేమా రోజారమణి, వార్డు సభ్యులు, వలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గోశాలకు వరిగడ్డి పంపిణీ



వీరులపాడు(కంచికచర్ల): వీరులపాడు మండలం చెన్నారావు పాలెం వెంకటేశ్వర స్వామి దేవస్థానం తరపున సర్పంచి ప్రత్తిపాటి మల్లికార్జునరావు జుజ్జూరు గ్రామంలో కొలువై ఉన్న నరసింహస్వామి ఆలయం గోశాలకు సోమవారం వరిగడ్డిని ట్రాక్టర్ ద్వారా తరలించారు. గోశాలలో ఆవులు, పశువులు ఉన్నాయని వాటి సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ కందుల వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ దాములూరి సురేష్, ప్రత్తిపాటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో నాలుగు అర్జీలు

కంచికచర్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి నాలుగు అర్జీలు వచ్చాయని తహసీల్దార్ వి.రాజకుమారి తెలిపారు. పట్టాదార్ పాసుపుస్తకాలు కావాలని రెండు, డ్వాక్రా సంఘంలో ఓ మహిళ సభ్యులకు తెలియకుండా నగదు కాజేసిందని ఆమెపై చర్యలు తీసుకోవాలని ఒక అర్జీ, కంచికచర్లలో డ్రైనేజీ పనులు చేపట్టాలని మరో అర్జీ వచ్చాయని అన్నారు. వచ్చిన అర్జీలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని తహసీల్దార్ అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.బాలశంకరరావు, ఏపీఎం కోట భాస్కరరావు, ఏఓ కె.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన



అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): గ్రామంలో నాడు-నేడు కింద జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న అదనపు తరగతి గదుల శ్లాబ్ పనులను సోమవారం సర్పంచ్ బి.జ్యోతిబ్రహ్మం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.కోటి నిధులతో 8 తరగతి గదుల నిర్మాణం చేపట్టామన్నారు. జగనన్న పాలనలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యనారాయణ, ఎస్‌ఎస్‌ఏ ఏఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పడిపూజ

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలోని యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి నరసింహస్వామి మాల దీక్ష స్వాముల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పడి పూజ వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో పడి ఏర్పాటు చేసి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. నరసింహస్వామి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఆలయం బయట ఏర్పాటుచేసిన అగ్నిగుండంలో స్వాములు నడుస్తూ తమ భక్తిని చాటుకున్నారు.

న్యాయవాదుల నిరసన

నందిగామ: విజయవాడలో బత్తిన హరిరామ్ అనే న్యాయవాదిపై జరిగిన దాడిని నిరసిస్తూ సోమవారం నందిగామ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు నిరసన తెలియజేశారు. బార్ అధ్యక్షుడు బండి మల్లికార్జునరావు అధ్యక్షతన విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని పరిరక్షించే న్యాయవాదులపై దాడులు చేయడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి పి.ప్రకాష్, న్యాయవాదులు బి.భాస్కరరావు, ఎన్.మల్లికార్జునరావు, వై.బాబురావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో జయంతి గ్రామం

- రూ.మూడు కోట్లకు పైగా అభివృద్ధి పనులు
- పట్టణాలకు దీటుగా మౌలిక సదుపాయాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



జయంతి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనం



నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ ప్రీ ప్రైమరీ పాఠశాల



గ్రామంలోని సిమెంట్ రోడ్డు

వీరులపాడు: చంద్రబాబు పాలనలో కనీస వసతులు లేక కునారిల్లిన గ్రామాలు నేడు అభివృద్ధి పథంలో సాగుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లోనే అన్ని వసతులు కల్పిస్తున్నారు. పల్లెసీమలు నేడు పట్టణాలకు దీటుగా అభివృద్ధి చెందుతున్నాయి. మండలంలోని జయంతి గ్రామం మేజర్ గ్రామ పంచాయతీ. గ్రామంలో 6,100 మంది జనాభా ఉండగా 3,650 మంది ఓటర్లున్నారు. గత ప్రభుత్వాల హయాంలో రహదారులు సరిగా లేక డ్రైన్‌లలో మురుగు నీరు పారుదల కాక నానా ఇబ్బందులు పడేవారు. ముఖ్యంగా సరైన వసతులు లేక ప్రభుత్వాధికారులు కూడా గ్రామంలో అందుబాటులో ఉండేవారు కాదని, ఏ చిన్న పని కావాలన్నా మండల కేంద్రమైన వీరులపాడు వెళ్లాల్సి వచ్చేదని గ్రామస్తులు తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత రహదారుల మరమ్మతులతో పాటు సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్, జగనన్న పాలవెల్లువ, పాఠశాలల అభివృద్ధి చేపట్టటంతో పెద్ద ఎత్తున అబివృద్ధి పనులు చేస్తుండటంతో గ్రామ రూపురేఖలు మారాయని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో మండల కేంద్రానికి వెళ్లే పని లేకుండా పోయిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రూ.మూడు కోట్ల విలువైన అభివృద్ధి పనులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో గ్రామంలో రూ.మూడు కోట్లకు పైగా నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. రూ.60 లక్షలతో గ్రామ సచివాలయం భవనం నిర్మించగా రూ.12 లక్షలతో అంగనవాడీ ప్రీ ప్రైమరీ పాఠశాల భవనం, నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా రూ.90 లక్షలతో గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధి చేశారు. మండల పరిషత్ పాఠశాలలో రూ.15 లక్షలతో అభివృద్ధి, అదనపు గదుల నిర్మాణ పనులు చేపట్టగా, ఎస్సీ కాలనీలోని పాఠశాల భవన నిర్మాణానికి రూ.ఐదు లక్షలు, రూ.22 లక్షలతో రైతు భరోసా కేంద్రం నిర్మించినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. గ్రామంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్, జగనన్న పాలవెల్లువ భవన నిర్మాణ పనులు చురుకుగా సాగుతుండటంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గతంలో ఎన్నడూ చూడని అభివృద్ధి

గతంలో పాలకులు, అధికారుల చుట్టూ తిరిగినా పనులు జరిగేవి కావు. నేడు గ్రామంలో గతంలో ఎన్నడూ చూడని అభివృద్ధిని చూస్తున్నాం. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్, పాఠశాలలు, రహదారుల అభివృద్ధి చూస్తుంటే నమ్మలేకపోతున్నాం. ముఖ్యమంత్రి జగన్‌కు అండగా ఉంటాం.

–ఇప్పల సత్యనారాయణ రెడ్డి, స్థానికుడు



మండల కేంద్రం వెళ్లే పని తప్పింది

గతంలో ఏ పని కావాలన్నా మండల కేంద్రమైన వీరులపాడు వెళ్లాల్సి వచ్చేది. గ్రామ సచివాలయం, వలంటీర్ వ్యవస్థతో మండల కేంద్రానికి వెళ్లే పని తప్పింది. పింఛన్ కోసం కాళ్లరిగేలా తిరగటమే కాదు కళ్లు కాయలు కాసేలా ఎదురు చూసే వాళ్లం. ఇప్పుడు తెల్లవారక ముందే తలుపు తట్టి పింఛన్ ఇస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్‌కు రుణపడి ఉంటాం.

–నిక్కి మాధవరావు, గ్రామస్తుడు

పీఎంశ్రీ పథకానికి కేవీఆర్ జెడ్పీ హైస్కూల్ ఎంపిక

పాఠశాలల అభివృద్ధికి కేంద్రం చేయూత



పెనుగంచిప్రోలు కేవీఆర్ జెడ్పీ హైస్కూల్

పెనుగంచిప్రోలు: విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నాడు-నేడు పథకం కింద ప్రభుత్వ బడులను అధునాతనంగా తీర్చిదిద్దుతోంది. సకల సదుపాయాలు కల్పిస్తోంది. విద్యాప్రమాణాల అమలుకు చిత్తశుద్ధితో పనిచేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ చర్యలకు తోడుగా కేంద్ర ప్రభుత్వం కూడా చేయూతనందిస్తోంది. ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ)పథకం కింద పాఠశాలల అభివృద్ధికి తోడ్పాటు నందిస్తూ విద్యాభివృద్ధికి వెన్నుదన్నుగా నిలుస్తోంది. పీఎంశ్రీ కింద పలు పాఠశాలలను ఎంపిక చేసి నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. మండల కేంద్రం పెనుగంచిప్రోలులోని కేవీఆర్ జెడ్పీ హైస్కూల్ ఈ పథకానికి ఎంపికైంది. ఇప్పటికే పాఠశాలలో ప్రభుత్వం నాడు-నేడు కింద రూ.1.30 కోట్లతో మౌలిక వసతులు కల్పిస్తోంది. నాబార్డు ద్వారా మరో రూ.కోటి నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. తాజాగా పీఎంశ్రీ పథకానికి కూడా ఈ పాఠశాల ఎంపిక కావటంతో పాఠశాలకు మరిన్ని సౌకర్యాలు రానున్నాయి. ఈ పథకం ద్వారా స్మార్ట్ క్లాస్‌లు, లైబ్రరీ, క్రీడా సదుపాయాలు సమకూర్చటం, గుణాత్మక విద్య మరింత సమర్థంగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటారు.



మరిన్ని వసతులు సమకూరతాయి

ఎంతో చరిత్ర కలిగిన కేవీఆర్ జెడ్పీ హైస్కూల్ పీఎంశ్రీ పథకానికి ఎంపిక కావటం సంతోషంగా ఉంది. ఇప్పటికే జగనన్న ప్రభుత్వం నాడు-నేడు పథకం కింద పాఠశాలలో 11 అదనపు తరగతి గదులు నిర్మిస్తోంది. ఈ పథకం ద్వారా పాఠశాలకు మరిన్ని వసతులు సమకూరతాయి.

–వేల్పుల పద్మకుమారి, సర్పంచ్, పెనుగంచిప్రోలు

ఉపాధి హామీ కూలీలకు ప్రత్యేక సదుపాయాలు



ఏపీఓకు కిట్ అందజేస్తున్న ఎంపీపీ, వైద్యాధికారి

పెనుగంచిప్రోలు: వేసవిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పనిచేస్తున్న కూలీలకు ప్రభుత్వం ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తోందని ఎంపీపీ మార్కపూడి గాంధీ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం కూలీలకు ఏఆర్‌ఎస్ ప్యాకెట్లతో కూడిన మెడికల్ కిట్‌ను ఎంపీపీ గాంధీ, వైద్యాధికారి సుజన చేతుల మీదుగా ఏపీఓ తిరుపతయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ కూలీలకు వడదెబ్బ సోకకుండా ప్రభుత్వం అనేక సదుపాయాలు కల్పిస్తోందన్నారు. మండలంలో ప్రతిరోజూ ఆరు వేల మందికి పైగా కూలీలు ఉపాధి పనుల్లో పాల్గొంటున్నారన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ ఏఓ సిద్ధారెడ్డి, వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ కార్యదర్శులు, ఉపాధిహామీ పథకం టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

వేసవిలో ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



ఎంపీడీఓ బాలశంకరరావుకు మెడికల్ కిట్లు అందజేస్తున్న వైద్యురాలు మధురిమ

కంచికచర్ల: వేసవికాలంలో ఎండ దెబ్బ, వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కంచికచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు కె.మధురిమ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కె.బాలశంకరరావుకు డాక్టర్ మధురిమ సోమవారం మెడికల్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం మండలంలోని ప్రతి గ్రామ సచివాలయానికి మెడికల్ కిట్లను పంపిణీ చేసిందన్నారు. ఈ మెడికల్ కిట్లు ప్రజలు వేసవికాలంలో వడదెబ్బకు గురయితే ఉపయోగపడతాయన్నారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, బీకాంప్లెక్స్ మాత్రలు, ఐరన్ మాత్రలు, పారాసిటమల్, నీరసం లేకుండా ఉండేందుకు మాత్రలు అందజేశారు. అంతేకాకుండా వేసవిలో ఎండలో పనిచేసే ఉపాధి హామీ కూలీలకు కూడా మెడికల్ కిట్లు అందజేశామన్నారు. వాంతులు, విరేచనాలు, వడదెబ్బకు గురయితే వెంటనే సమీపంలో పీహెచ్‌సీలకు వెళ్లి ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. అవసరమైన మందులు ఉచితంగా ఇస్తారన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, ఏపీఓ రమాదేవి, పంచాయతీ కార్యదర్శి రవికుమార్, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో పంచాయతీరాజ్ వ్యవస్థ కీలకం



సర్పంచ్‌ల సన్మాన కార్యక్రమంలో ఎంపీపీ గాంధీ, మండల పరిషత్ అధికారులు



ఉత్తమ గ్రామ పంచాయతీ సర్పంచులను సత్కరిస్తున్న జెడ్పీటీసీ ప్రశాంతి, ఎంపీడీఓ బాలశంకరరావు

పెనుగంచిప్రోలు: దేశాభివృద్ధిలో పంచాయతీరాజ్ వ్యవస్థ ఎంతో గొప్పదని ఎంపీపీ మార్కపూడి గాంధీ అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయిలో ఎంపికైన ఉత్తమ పంచాయతీల సర్పంచ్‌లకు ప్రశంసాపత్రాలు, సన్మానాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9 అంశాల్లో ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా ఈ ఎంపిక జరిగిందన్నారు. స్వయం సమృద్ధి, మౌలిక వసతుల కల్పనల పంచాయతీలుగా పెనుగంచిప్రోలు, కొణకంచి, వెంకటాపురం, పరిశుభ్రత, హరిత పంచాయతీలుగా పెనుగంచిప్రోలు, ముచ్చింతాల, గుమ్మడిదూర్రు, పేదరిక రహిత, అధునిక జీవనోపాధుల పంచాయతీగా ముండ్లపాడు, అనిగండ్లపాడు, సుబ్బాయిగూడెం, ఆరోగ్యకరమైన పంచాయతీగా అనిగండ్లపాడు, నవాబుపేట, వెంగనాయకునిపాలెం, బాలహిత పంచాయతీగా వెంకటాపురం, కొణకంచి, శివాపురం, నీటి సమృద్ధి పంచాయతీగా ముచ్చింతాల, కొళ్లికూళ్ల, శనగపాడు, సామాజికంగా సురక్ష పాలన పంచాయతీగా వెంకటాపురం, తోటచర్ల, శివాపురం, సుపరిపాలన గల పంచాయతీగా ముండ్లపాడు, లింగగూడెం, ముచ్చింతాల, ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీగా కొణకంచి, గుమ్మడిదూర్రు, నవాబుపేట ఎంపిక అయ్యాయన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, ఏఓ సిద్ధారెడ్డి, ఈఓపీఆర్‌డీ శ్యామ్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉత్తమ గ్రామ పంచాయతీ సర్పంచులకు సత్కారం

కంచికచర్ల: జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల స్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీలకు పురస్కారాలను జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి అందజేశారు. ముందుగా ఆయా గ్రామాల సర్పంచులకు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ మండలంలోని పరిటాల గ్రామ పంచాయతీకి 8 అవార్డులు, కునికెనపాడు గ్రామ పంచాయతీకి ఐదు అవార్డులు, మున్నలూరుకు ఏడు అవార్డులు, కంచికచర్లకు మూడు, గనిఆత్కూరుకు రెండు, బత్తినపాడు, గండేపల్లి గ్రామాలకు ఒక్కొక్కటి చొప్పున అవార్డులు వచ్చాయన్నారు. అవార్డులు వచ్చిన సర్పంచులు, కార్యదర్శులను సత్కరించారు. కంచికచర్ల, పరిటాల, కునికెనపాడు, మున్నలూరు, కీసర, గనిఆత్కూరు సర్పంచులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.బాలశంకరరావు, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, ఏపీఓం కె.భాస్కరరావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు వేల్పుల శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి కె.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గండ్రాయి పంచాయతీకి జిల్లా స్థాయి పురస్కారం



విజయవాడలో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న సర్పంచ్ లూర్దు మేరి

జగ్గయ్యపేట: మండలంలోని గండ్రాయి గ్రామ పంచాయతీకి జిల్లా స్థాయి పురస్కారం లభించింది. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా సోమవారం విజయవాడలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఢిల్లీరావు, జిల్లా పంచాయతీరాజ్ అధికారి సంధ్య చేతుల మీదుగా సర్పంచ్ కొత్తపల్లి లూర్దు మేరికి జిల్లా పురస్కారం అందజేశారు. కరోనా సమయంలో గ్రామంలో శానిటేషన్, అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు గర్భిణుల పౌష్టికాహార పర్యవేక్షణ చేసి, హెల్దీ పంచాయితీ విభాగంలో చొరవ చూపినందుకు గాను ఈ జిల్లా పురస్కారం లభించిందని సర్పంచ్ లూర్దు మేరి తెలిపారు.

అంబారుపేట సర్పంచికి ఉత్తమ పురస్కారం



జిల్లా కలెక్టర్ చేతుల మీదగా పురస్కారం అందుకుంటున్న అంబారుపేట సర్పంచ్ రమ

నందిగామ: మండలంలోని అంబారుపేట గ్రామ పంచాయతీ సర్పంచ్ ఐలపోగు రమ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. సోమవారం విజయవాడలో జిల్లా స్థాయిలో ఉత్తమ పంచాయతీలకు పురస్కారాలు అందజేశారు. ఈ తరుణంలో జిల్లా స్థాయిలో మొదటి స్థానాన్ని అంబారుపేట పంచాయతీ కైవసం చేసుకుంది. ఈ నేపథ్యంలో కలెక్టర్ గ్రామ సర్పంచ్ రమాను సత్కరించడంతోపాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

గ్రామ స్వరాజ్యాన్ని తీసుకువచ్చిన జగనన్న



పారిశుద్ధ్య కార్మికులను సన్మానించిన సర్పంచ్ పద్మకుమారి

పెనుగంచిప్రోలు: సచివాలయ వ్యవస్థతో గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకువచ్చిన నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని సర్పంచ్ వేల్పుల పద్మకుమారి అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా సోమవారం పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న పాలనలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతోందన్నారు.ఈ సందర్భంగా పారిశుద్ధ్య సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో పూసల గ్రామ ఉపసర్పంచ్ బాడిశ పాపారావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, కార్యదర్శి శ్యామ్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వేమవరం సొసైటీ అధ్యక్షుడిగా వేమిరెడ్డి

కంభంపాడు(వత్సవాయి): వేమవరం ప్రాథమిక సహకార పరపతి సంఘం నూతన అధ్యక్షునిగా కంభంపాడు మాజీ సర్పంచ్ వేమిరెడ్డి వెంకట నారాయణరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభానుకు కృతజ్ఞతలు తెలియజేశారు. రుణాలు కావల్సిన రైతులు నేరుగా సొసైటీలో సంప్రదించి కావల్సిన రుణాలను తీసుకోవచ్చని సూచించారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే వడ్డీ తిరిగి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గాదెల రామారావు, జెడ్పీటీసీ సభ్యురాలు యేశపోగు దేవమణి, ఎంపీటీసీ కల్యాణి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు గంగిపోగు శిరీష, నాయకులు చింతకుంట్ల వెంకటరెడ్డి, సొసైటీ అధ్యక్షులు సామినేని లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవారి రథోత్సవం



నందిగామ: పట్టణంలోని నెహ్రూనగర్‌లో గల శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి రథోత్సవ కార్యక్రమం సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాలు ముగిసిన నేపథ్యంలో చిన్న రథంపై స్వామి వారిని పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. రాత్రి పొద్దుపోయే వరకు కొనసాగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• 30 నుంచి నరసింహస్వామి తిరు కల్యాణ మహోత్సవాలు

వేదాద్రి(జగ్గయ్యపేట): ఈ నెల 30నుంచి జరిగే యోగానంద లక్ష్మీనరసింహస్వామి తిరు కల్యాణమహోత్సవాలు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని నందిగామ ఆర్డీవో ఎ.రవీంద్రరావు అన్నారు. స్థానిక ఆలయ ప్రాంగణంలో ఆదివారం కల్యాణ మహోత్సవాలపై అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30 నుంచి మే7 వరకు కల్యాణ మహోత్సవాలు జరుగుతాయన్నారు. ముఖ్యంగా ఈ ఉత్సవాల్లో స్వామి వారి కల్యాణం మే4వ తేదీ రాత్రి 12 గంటలకు కల్యాణం జరుగుతుందన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యంగా తాగునీటి వసతి, ఆలయ ప్రాంగణం అంతా చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలన్నారు. వైద్యశిబిరం ఏర్పాటు చేసి 104ను అందుబాటులో ఉంచాలన్నారు. కల్యాణం జరిగే రెండు రోజుల ముందు నుంచే ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంచాలన్నారు. నది వద్ద గజ ఈతగాళ్లు, బారికేడ్లు అందుబాటులో ఉంచాలన్నారు. పారిశుద్ధ్యం విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈవో కె.నాగరాజు, తహసీల్దార్ నాగరాజు, మున్సిపల్ కమిషనర్ మల్లేశ్వరరావు, సర్పంచ్ పేరయ్య, చిల్లకల్లు ఎస్ఐ దుర్గాప్రసాద్, కేసీపీ ప్రతినిధి రాంప్రసాద్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

• ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

నవాబుపేట(పెనుగంచిప్రోలు): గ్రామంలో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి అన్నారు. గ్రామంలో సోమవారం గృహ నిర్మాణాలకు సంబంధించి లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం కాలనీల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. రెండు లేఅవుట్లలో నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని ఒక చోట మాత్రమే జరగటం లేదన్నారు. తక్షణం అందరూ నిర్మాణాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మేరీ, ఎంపీటీసీ సభ్యురాలు శాంతకుమారి, హౌసింగ్ ఏఈ సుబ్బారావు, విద్యుత్ ఏఈ పూర్ణచంద్రరావు, గ్రామ నాయకులు గింజుపల్లి శ్రీనివాసరావు, మధు తదితరులు పాల్గొన్నారు.

• 30 లోగా పన్ను బకాయిలు చెల్లిస్తే 5 శాతం రాయితీ

జగ్గయ్యపేట అర్బన్: పురపాలక సంఘ పరిధిలో ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను బకాయిలు చెల్లించని వారు ఈనెల 30 వ తేదీ లోగా మొత్తం బకాయిలు చెల్లిస్తే 5 శాతం రాయితీ వర్తిస్తుందని మున్సిపల్ కమిషనర్ మల్లేశ్వరరావు తెలిపారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సెలవు రోజుల్లో కూడా మున్సిపల్ ఆన్‌లైన్ కౌంటర్‌లో పన్నులు కట్టించుకుంటారని తెలిపారు.

• పంచాయతీరాజ్ చట్టాలపై అవగాహన అవసరం

చిల్లకల్లు(జగ్గయ్యపేట): గ్రామాల్లో ఎన్నికైన ప్రజాప్రతినిధులు పంచాయతీరాజ్ చట్టాలను తెలుసుకుని వాటిని అమలు చేసేలా చొరవ తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి సి.బాలాజీ కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గ్రామాల సుస్థిర అభివృద్ధి, మౌలిక అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ఉత్తమ గ్రామ పంచాయతీలుగా ఎన్నికైన బూదవాడ, అన్నవరం, ముక్త్యాల, గండ్రాయి, మల్కాపురం, ధర్మవరప్పాడు తండా, పోచంపల్లి, షేర్‌మహ్మద్‌పేట సర్పంచ్‌లకు అవార్డులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయచంద్ర, ఈవోపీఆర్డీ సాంబశివరావు, మాజీ ఎంపీపీలు మాతంగి వెంకటేశ్వర్లు, పెంటి శ్రీనివాసరావు, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసగౌడ్, సొసైటీ అధ్యక్షుడు బాల సైదా, పలు గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

• మన పథకాలు దేశానికే ఆదర్శం

నందిగామ: మన రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు దేశానికే ఆదర్శమని కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్ అన్నారు. మండలంలోని మాగల్లు గ్రామంలో సోమవారం సాయంత్రం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరుపై వివరాలు సేకరించడంతోపాటు ప్రజల అభిప్రాయాలను సేకరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దేవినేని నాగేశ్వరరావు, గుంటి ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

• మలేరియాతో అప్రమత్తం : ఆర్డీఓ

నందిగామ: మలేరియా వ్యాధి విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో రవీంద్రరావు సూచించారు. మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో పలువురు వైద్యులతో కలిసి ఆర్డీవో మలేరియా లక్షణాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ వైద్యశాలలో మలేరియా నిర్ధారణ చేసేందుకు అవసరమైన కిట్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి ప్రభుత్వ వైద్యశాలలో ఉచితంగా వైద్య సేవలు అందించడంతో పాటు అవసరమైన మందులను కూడా ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. మలేరియాపై ప్రజలకు మరింత అవగాహన కల్పించేందుకు మంగళవారం నియోజకవర్గ పరిధిలో అవగాహన ర్యాలీలు నిర్వహిస్తామని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు రవి, భారతి, సురుచి, సత్యవతి పాల్గొన్నారు.

• సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు

నందిగామ: అర్జీల రూపంలో అందిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్డీఓ రవీంద్రరావు తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు.ఇందులో భాగంగా డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి పలు సమస్యల పరిష్కారం కోరుతూ 9 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ప్రజా సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకే ప్రభుత్వం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డివిజన్ పరిధిలోని ప్రతి మండల కేంద్రాలతో పాటు ఆర్డీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని సమస్యలు పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.